

2

లైవ్ ఇంటర్వ్యూలో రచ్చ.. యాంకర్‌ను అవమానించి.. మైక్ విసిరి వెళ్లిపోయిన ట్రంప్

TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :68 08 సోమవారం, జూన్ 2026 వేల : 5/-



కల నెరవేరింది

2

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad

## 'హైడ్రా'కు హిట్లరే స్ఫూర్తి..

- సీఎం రేవంత్ వ్యాఖ్యలతో దుమారం
- హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా ఏజెన్సీని ఏర్పాటు చేశానన్న సీఎం రేవంత్
- బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యలు
- రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తీవ్ర ఆగ్రహం
- ఇది కాంగ్రెస్ హిట్లర్, ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనమన్న బీజేపీ
- చారిత్రకంగా రేవంత్ వాదనలో నిజం లేదంటున్న నిపుణులు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో పెను దుమారం రేపుతున్నాయి. రాష్ట్రంలో ఆక్రమణల తొలగింపు, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) వ్యవస్థకు జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో పేరు పెట్టానని ఆయన స్వయంగా చెప్పడమే ఈ వివాదానికి కారణమైంది. బెంగళూరులో నిన్న జరిగిన 'ది హిందూ' హడిల్ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.

2

## ఇండియా బ్లాక్ సమావేశానికి మమతా బెనర్జీ.. టీఎంసీకి కీలకంగా మారనున్న సమావేశం



పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ మళ్లీ రాజకీయంగా పుంజుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా చాలా కాలం తర్వాత ఇండియా బ్లాక్ సమావేశానికి మమత హాజరుకానున్నారు. ఇందుకోసం మమత ఢిల్లీకి బయల్దేరారు. సోమవారం ఈ సమావేశం జరగనుంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఈ సమావేశానికి నేతృత్వం వహించనుంది.ప్రతిపక్షాల కూటమిగా ఉన్న ఇండియా బ్లాక్ ప్రస్తుతం భవిష్యత్ రాజకీయాలపై దృష్టిపెట్టింది. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు వరుసగా ఓటమి చవిచూస్తున్నాయి. బీజేపీ చేతిలో పరాజయం పాలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమావేశం కీలకం కానుంది. సమావేశానికి 23 పార్టీలు హాజరవుతాయని కాంగ్రెస్ వెల్లడించింది. టీఎంసీ ఘోర ఓటమి తర్వాత ఆ పార్టీకి ఈ మీటింగ్ కీలకం కానుంది. అక్కడ బీజేపీ భారీ విజయం సాధించింది. ఇది రాజకీయంగా భారీ చర్చకు దారితీసింది. ఇటీవల ముగిసిన ఎన్నికల తర్వాత ఇండియా బ్లాక్ సమావేశం జరగడం ఆసక్తికరంగా మారింది. బీజేపీ రాజకీయంగా ఎదగడం ఆయా పార్టీలకు ఇబ్బందిగా మారింది.ఇండియా కూటమిలో విబేదాల తర్వాత ఇంతకాలానికి అన్ని ఎక్కువ పార్టీలు ఏకమవుతున్నాయి. ఇండియా బ్లాక్ తన లక్ష్యాల్ని మళ్లీ నిలబెట్టుకోవాలని నిర్ణయించింది. ఇండియా బ్లాక్‌కు నాయకత్వం, సమన్వయం, రాబోయే ఎన్నికల్లో కలిసి పని చేయడంపై కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే, ఈ మీటింగ్‌కు డీఎంకే హాజరు కావడం లేదు. ఇంతకాలం డీఎంకే.. ఇండియా కూటమిలో కీలకంగా ఉంది. అయితే, కాంగ్రెస్ పార్టీ తమిళనాడులు డీఎంకేను కాదని టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ పార్టీ కాంగ్రెస్‌పై వ్యతిరేకతతో ఉంది. అందుకే, ఈ కూటమికి డీఎంకే దూరంగా ఉండనుంది.

### కిషన్ రెడ్డి సంగతి జూన్ 15 తర్వాత తేలుస్తా..

# బరాబర్ జవాబిస్తా



- హైదరాబాద్ అభివృద్ధిని కేంద్ర మంత్రి అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు
- మెట్రో, మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు పనులకు ఆటంకాలు సృష్టిస్తున్నారని విమర్శ
- ఉప్పల్ నియోజకవర్గంలో రూ.1600 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రాజకీయాలకు అతీతంగా నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టీకరణ

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కిషన్ రెడ్డి అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. జూన్ 15వ తేదీ తర్వాత ఆయన సంగతి బరాబర్‌గా తేలుస్తానని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉప్పల్‌లో రూ.1600 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు."తెలంగాణ ప్రజలతో గోక్కున్నవాడు ఎవరూ బాగుపడలేదు" అంటూ రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్డు వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి కాళ్లల్లో కట్టెలు పెట్టి ఆపుతున్నారని ఆయన ఆరోపించారు. "రీజనల్ రింగ్ రోడ్డు అనుమతుల కోసం నేను యాభై సార్లు ఢిల్లీకి వెళ్లాను, ప్రధానిని కలిశాను. దీనిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కిషన్ రెడ్డికి లేదా? హైదరాబాద్ ప్రజలు ఆయనకు ఓట్లు వేయలేదా?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అన్ని అనుమతులు వచ్చాక మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని, మూసీ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, మిగిలిన 25 లక్షల టన్నులను కేంద్రంతో కొనిపించే బాధ్యత కిషన్ రెడ్డికి లేదా అని నిలదీశారు. బీజేపీలో ఉంటూనే చీకట్లో ఇతరులతో కిషన్ రెడ్డి సహకారం తీసుకుంటున్నారని, గతంలో కుమ్మక్కు రాజకీయాలు చేసినందుకే ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అభివృద్ధి విషయంలో తాను రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని సీఎం స్పష్టం చేశారు. "నిజంగా నేను రాజకీయం చేస్తే, బీఆర్ఎస్ నేత బండారు లక్ష్మారెడ్డి తండ్రిగారైన బండారు రాజిరెడ్డి పేరును ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు పెట్టేవాడిని కాదు. ఈ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తించాం" అని తెలిపారు. అభివృద్ధి కోసం కలిసి వస్తే ఎల్బీ స్టేడియంలో కిషన్ రెడ్డికి గండపెండేరం తొడుగుతామని, కానీ ఆయన సహకరించడం లేదని అన్నారు.మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం వల్లే తాను ఈరోజు ముఖ్యమంత్రిగా ఉన్నానని, కొడంగల్‌లో ఓడిపోయిన తనను ఇక్కడి ప్రజలే ఆశీర్వదించి గెలిపించారని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. మల్కాజిగిరిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగానే పరిపాలన సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. మూసీ ప్రక్షాళన రెండో దశను నాగోల్ నుంచి గౌరెల్లి వరకు చేపడతామని, వంద రోజుల్లో కార్యాచరణ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలప్పుడు రాజకీయాలు చేద్దామని, ఇప్పుడు నగరాభివృద్ధికి అందరూ కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్



- రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నారని విమర్శలు
- కేసీఆర్‌ను ప్రజలు ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని వ్యాఖ్య
- విదేశీ వ్యామోహంతో ప్రజల సమస్యలు మరచిన రేవంత్‌కు అదే గతి తప్పదన్న కిషన్ రెడ్డి
- తెలంగాణలో పాలన మారినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని విమర్శ

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టిన గతే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అబద్ధపు హామీలు, అసమర్థ పాలనతో ప్రజాగ్రహానికి గురై ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తూ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారం మారినా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదని విమర్శించారు. అడ్డగోలు హామీలు, నమ్మకద్రోహంతో క్షేత్రస్థాయి సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. సొంత దేశంలో జరుగుతున్న అభివృద్ధిపై విమర్శలు చేస్తూ, విదేశాలపై వ్యామోహం చూపించడం ఇద్దరు ముఖ్యమంత్రుల్లోనూ చూశామని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను పట్టించుకోకుండా విదేశీ భాషలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ కు పట్టిన గతే పడుతుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. చేతగాని పాలన అందిస్తున్న నేతల గ్రాఫ్ పాతాళానికి పడిపోవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

### గోషామహల్ నియోజకవర్గంపై

## గులాబీ జెండా ఎగరాలి

### : మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్ :




వచ్చే ఎన్నికలలో గోషామహల్ నియోజకవర్గం పై గులాబీ జెండా ఎగరాలని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్త లు సైనికుల్లా పని చేయాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో గోషామహల్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో పైరవీలకు తావు లేదని, కష్టపడి పనిచేస్తూ ప్రజాదరణ ఉన్న వారికే సముచిత స్థానం, గౌరవం లభిస్తాయని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం లో గోషామహల్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, 10 కోట్ల రూపాయల వ్యయంతో ఫిష్ మార్కెట్ నిర్మాణం, నాలా నిర్మాణం, డ్రైనేజీ సమస్యల పరిష్కారం వంటి అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నెల 24 వ తేదీ నుండి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అక్రమంగా ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులు10 సంవత్సరాల కేసీఆర్ పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని అన్నారు. సీఎం తన స్థాయిని మరిచి బూతుబాష మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థానానికి ఉన్న గౌరవాన్ని దిగజారుస్తున్నారని విమర్శించారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పై పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, మహేందర్, పలువురు నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# అమెరికాలో మళ్లీ కాల్పులు..

### 12 మందికి తీవ్ర గాయాలు



అమెరికా లో మరోసారి కాల్పుల కలకలం చెలరేగింది. ఒహియో రాష్ట్రం నగరంలో శనివారం సాయంత్రం జరిగిన 'ఓల్డ్ వెస్ట్ ఎండ్ ఫెస్టివల్ (రాశ్రీస ఔవర్ జుఅస ఖీవర్‌ఆఝుశ్రీ)' లో దుండగులు జరిపిన కాల్పుల్లో కనీసం 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘోర ప్రమాదంలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, పండుగ వాతావరణంలో ఒక్కసారిగా బుల్లెట్ల వర్షం కురవడంతో జనం ప్రాణాలు అరచేతబట్టుకుని పరుగులు తీశారు. చారిత్రాత్మక నగరమైన టోలెడోలో 53వ వార్షిక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. లైవ్ మ్యూజిక్, ఫ్యామిలీ ఈవెంట్లతో కుటుంబాలన్నీ పండుగను ఆస్వాదిస్తున్న తరుణంలో అమెరికా కాలమాన ప్రకారం.. సాయంత్రం 5:37 గంటల ప్రాంతంలో డెలావేర్, గ్లెన్‌వుడ్ అవెన్యూల సమీపంలో ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకరిపై ఒకరు పరస్పరం కాల్పులు జరుపుకోగా అక్కడ గుమిగూడిన సామాన్య ప్రజలు ఈ క్రాస్‌ఫైరింగ్‌లో చిక్కుకున్నట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే టోలెడో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రక్షించారు. గాయపడిన వారిలో 14 ఏళ్ల మైనర్ల నుంచి 61 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారని డిప్యూటీ పోలీస్ చీఫ్ జో హెఫెర్నన్ తెలిపారు. ఘటనా స్థలంలోనే ప్రథమ చికిత్స అందించి, బాధితులను వెంటనే స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ హింసాత్మక ఘటన తర్వాత ఉత్సవానికి సంబంధించిన మిగిలిన అన్ని కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు స్థానిక యంత్రాంగం ప్రకటించింది.

2

## రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం
- మీకు హిట్లరే స్ఫూర్తి అంటూ ఎద్దేవా
- మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా అని విమర్శ
- తమ పాలన అంబేద్కర్, గాంధీ ఆశయాలకు అనుగుణమని వెల్లడి
- బెంగళూరులో రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా పోస్ట్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించార

2

## మంచినీటి శుద్ధి వాటర్ ప్లాంట్ కు సర్పంచ్ స్వయంగా పనులు చేస్తూ మరమ్మత్తులు చేపట్టిన-

### గ్రామ సర్పంచ్ ఆంగోత్ రవికుమార్ నాయక్

### తన ఇంటి పని లాగా భావించి తానే స్వయంగా పనులు చేస్తూ మరుపాత్తులు చేపట్టిన - సర్పంచ్ రవి కుమార్ నాయక్

**గోదావరిఖని జూన్ 07 హైదరాబాద్ మిర్రర్**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి టి ఎస్ అంతర్గం గ్రామం గ్రామంలోని ఆర్వో మంచినీటి శుద్ధి వాటర్ ప్లాంట్ గత కొద్ది సంవత్సరాలుగా నిరుపయోగంగా మారడంతో వాటర్ ప్లాంట్ ప్రజలకు ఉపయోగపడే విధంగా గ్రామ సర్పంచ్ ఆంగోతు రవికుమార్ నాయక్ అతనే స్వయంగా ప్లాంట్ వద్ద పనులు చేస్తూ మరమ్మత్తులు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంగోతు రవికుమార్ నాయక్ మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాల నుండి గ్రామంలో ఉన్నటువంటి మంచినీటి శుద్ధి వాటర్ ప్లాంట్ ప్రజలకు ఉపయోగపడకుండా,ఎవరు పట్టించుకోక పోవటంతో నిరుపయోగంగా మూలకుపడడంతో ఈ సమస్యను ప్రజలు నా దృష్టికి తీసుకురావడం జరిగింది. దీనిలో భాగంగానే ప్రజలకు నేను ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే అర్వో వాటర్బి ప్లాంట్ కు మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు మంచినీరు అందే విధంగా చేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. దీనిలో భాగంగానే గ్రామ సర్పంచ్ తాను తనవంతుగా స్వయంగా పనులు చేస్తూ మరమ్మత్తులు మొదలుపెట్టి రెండు, మూడు రోజులలో గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండే విధంగా ప్రతి ఇంటికి నీరు అందే విధంగా ఆర్వో ప్లాంట్ ను శుద్ధిచేసి ప్రజలకు మంచినీరు అందిస్తానని గ్రామ సర్పంచ్ ఆంగోతు రవికుమార్ నాయక్ ప్రజలకు హామీ ఇస్తూ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆంగోతు రవికుమార్ నాయక్, పాలకవర్గం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## త్రిబుల్ ఐటీ లో సీటు సాధించిన విద్యార్థులను సన్మానించిన

### మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**నారాయణఖేడ్ జూన్ 07 హైదరాబాద్ మిర్రర్**

నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన 5 మంది జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులు బాసర త్రిబుల్ ఐటీ లో సీటు సాధించడంతో వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రావు పాటిల్, రాణా ప్రతాప్ సింగ్, నాయకులు నర్స గౌడ్, సర్దార్ నాయక్, సురేష్, వసీం, జబ్బర్, నార్య నాయక్, పుండరీకం తదితరులు ఉన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహణ

### పూర్వ విద్యార్థులను అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ సూర్యదేవర వెంకటేశ్వరరావు జ్యోతి

**గోదావరిఖని జూన్ 07 హైదరాబాద్ మిర్రర్**

గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ హైస్కూల్ 2005--2006 నాటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా, ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యదేవర జ్యోతి--వెంకటేశ్వర్ రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే ఉపాధ్యాయులు లక్ష్మి--దుర్గాప్రసాద్, చందు--పుష్పవేణి, జైపాల్ రెడ్డి, కృష్ణవేణి, తిరుపతి గార్లు పాల్గొని పూర్వ విద్యార్థులను అభినందించారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా గురువులను సన్మానించారు. 2005--2006 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అందరూ ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గోలి ప్రవీణ్, నరేష్, మెకల్ శ్రీను, ప్రశాంత్, సృజన, లావణ్య, సౌజన్య తదితరులు ముఖ్య పాత్ర పోషించారు. ఈ సమ్మేళనం ద్వారా పూర్వ విద్యార్థుల మధ్య స్నేహ బంధాలు మరింత బలపడటంతో పాటు, గురువుల పట్ల గౌరవం, పాఠశాలపై అనుబంధం మరింతగా వ్యక్తమైంది. 20సంవత్సరాల తర్వాత కలిసిన ఆనందో త్సాహాశీ వెల్లివిరిసింది ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.





మొదటిపేజీ తరువాయి

## లైవ్ ఇంటర్వ్యూలో రచ్చ.. యాంకర్‌ను అవమానించి.. మైక్ విసిరి వెళ్లిపోయిన ట్రంప్

### ఎన్బీసీ ఇంటర్వ్యూ నుంచి మధ్యలోనే వెళ్లిపోయిన డొనాల్డ్ ట్రంప్

### ఎన్నికల రిగ్గింగ్‌పై ఆధారాలు అడగడంతో తీవ్ర ఆగ్రహం

### యాంకర్ క్రిస్టెన్ వెల్కర్‌పై 'వంకర బుద్ధి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు

### చర్చ మధ్యలోనే మైక్రోఫోన్ తీసి నేలపై పడేసి నిష్క్రమణ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో వార్తల్లో నిలిచారు. ప్రముఖ వార్తా సంస్థ ఎన్బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో యాంకర్ అడిగిన ప్రశ్నలకు తీవ్ర ఆగ్రహానికి గురై, ఆమెను దారుణంగా అవమానించి, మధ్యలోనే కార్యక్రమం నుంచి నిష్క్రమించారు. తనపై ప్రశ్నల వర్షం కురిపించిన యాంకర్‌ను 'వంకర బుద్ధి కలదానివి', 'మూర్ఖురాలివి' అంటూ సంభోదిస్తూ, చేతిలోని మైక్రోఫోన్‌ను నేలపై విసిరి కొట్టి వెళ్లిపోయారు. ఈ ఘటన ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. ఎన్బీసీ ఛానెల్‌లో ప్రసారమయ్యే 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం కోసం యాంకర్ క్రిస్టెన్ వెల్కర్, డొనాల్డ్ ట్రంప్‌ను ఇంటర్వ్యూ చేశారు. కాలిఫోర్నియాలో ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆలస్యం కావడంపై ట్రంప్ మాట్లాడుతూ.. "నాలుగైదు రోజులు గడుస్తున్నా ఫలితాలు వెల్లడించడం లేదు. ఎందుకంటే వారు ఎన్నికల్లో మోసం చేస్తున్నారు" అని ఆరోపించారు. ట్రంప్ ఆరోపణలపై స్పందించిన యాంకర్ క్రిస్టెన్.. "మీ ఆరోపణలకు ఏవైనా ఆధారాలు ఉన్నాయా?" అని సూటిగా ప్రశ్నించారు. దీనికి ట్రంప్.. "నేను చూడటమే ఆధారం, ప్రజలు చెప్పేది వింటున్నాను" అని సమాధానమిచ్చారు. అయితే, అమెరికా ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని, పదేపదే స్పష్టమైన ఆధారం చూపాలని క్రిస్టెన్ కోరారు. దీంతో ట్రంప్ సహనం కోల్పోయారు. యాంకర్‌పై తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "అధికారులు వంకర బుద్ధి కలవారు. నువ్వు కూడా వంకర బుద్ధి దానివే. మీ మీడియా అంతా మోసపూరితం. 'మీట్ ది ప్రెస్' కూడా వంకర కార్యక్రమమే" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనికి యాంకర్.. "క్షమించండి, నేను వంకర బుద్ధి దాన్ని కాదు" అని బదులిచ్చే ప్రయత్నం చేయగా, ట్రంప్ మరింత రెచ్చిపోయారు. "నువ్వు వంకర బుద్ధి దానివి లేదా మూర్ఖురాలివి. ఎన్నికలు రిగ్గింగ్ అవుతున్నాయని మీ నెట్‌వర్క్‌కు కూడా తెలుసు. ఏబీసీ, సీబీఎస్, సీఎన్ఎన్ అన్నీ ఏకపక్షంగా వ్యవహరించే మోసపూరిత సంస్థలే" అంటూ ఆరోపించారు. అనంతరం "క్షమించు, ఇక చాలు. నాకు విసుగొచ్చింది. థ్యాంక్యూ డార్లింగ్, నీ పని నువ్వు చేసుకో" అని అంటూ తన మైక్రోఫోన్‌ను తీసి నేలపై పడేశారు. ఈ ఇంటర్వ్యూ కోసం తాను విస్కాన్సిన్‌కు వచ్చానని యాంకర్ చెప్పబోగా, "నీకోసం నేను గంట పాటు వర్షంలో కూర్చున్నాను. నీకు చాలా సమయం ఇచ్చాను" అని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇటీవల కాలంలో ట్రంప్ జర్నలిస్టులపై ఇలా వ్యవహరించడం ఇదే మొదటిసారి కాదు. కొద్ది రోజుల క్రితం సీఎన్ఎన్ రిపోర్టర్ కైట్లాన్ కాలిన్స్‌ను ఉద్దేశిస్తూ.. "ఆమె కళ్లలో ద్వేషం కనిపిస్తుంది, ఎప్పుడూ నవ్వదు" అని వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల పట్ల ట్రంప్ వ్యవహరిస్తున్న తీరుపై మరోసారి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొదటిపేజీ తరువాయి

## కల నెరవేరింది..

## ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా అలెగ్జాండర్ జ్వెరెవ్

### ఇటలీ ఆటగాడు కొబోలిపై ఐదు సెట్ల ఉత్కంఠ పోరులో గెలుపు

### నాలుగు గంటలకు పైగా సాగిన హోరాహోరీ ఫైనల్ మ్యాచ్

### గత పరాజయాలకు ముగింపు పలుకుతూ కెరీర్‌లో తొలి మేజర్ టైటిల్ కైవసం

### 28 ఏళ్ల తర్వాత గ్రాండ్‌స్లామ్ గెలిచిన తొలి జర్మన్ పురుష ఆటగాడిగా చరిత్ర

జర్మనీ టెన్నిస్ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడాడు. ఆదివారం జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో ఇటలీ ఆటగాడు ఫ్లావియో కొబోలిపై ఐదు సెట్ల హోరాహోరీ పోరులో అద్భుత విజయం సాధించాడు. పారిస్‌లోని ఫిలిప్ చాట్రియర్ కోర్టులో నాలుగు గంటల 16 నిమిషాల పాటు సాగిన ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో జ్వెరెవ్ 6-1, 4-6, 6-4, 6-7 (5/7), 6-1 తేడాతో గెలుపొందాడు. ఈ విజయంతో, 1996లో బోరిస్ బెకర్ తర్వాత మేజర్ టోర్నమెంట్ గెలిచిన తొలి జర్మన్ పురుష ఆటగాడిగా జ్వెరెవ్ చరిత్ర సృష్టించాడు. ఇప్పటికే మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఓటమి చవిచూసిన జ్వెరెవ్‌కు ఇది నాలుగో ఫైనల్. ముఖ్యంగా 2020 యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో రెండు సెట్ల ఆధిక్యంలో ఉండి కూడా ఓడిపోవడం అతడి కెరీర్‌లో తీవ్ర నిరాశను మిగిల్చింది. అయితే, ఈసారి ఒత్తిడిని అధిగమించి తన అనుభవాన్ని చాటుకున్నాడు. మరోవైపు, 50 ఏళ్ల తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ గెలవాలన్న ఇటలీ కలను నిజం చేయాలని భావించిన పదో సీడ్ కొబోలికి నిరాశే ఎదురైంది. మ్యాచ్ ఆరంభంలో కొబోలి ఒత్తిడికి గురవడంతో జ్వెరెవ్ సులభంగా తొలి సెట్‌ను 39 నిమిషాల్లోనే కైవసం చేసుకున్నాడు. అయితే, రెండో సెట్‌లో కొబోలి అనూహ్యంగా పుంజుకుని మ్యాచ్‌ను సమం చేశాడు. మూడో సెట్‌ను జ్వెరెవ్ గెలవగా, నాలుగో సెట్ టై బ్రేకర్‌కు దారితీసింది. ఇందులో కొబోలి అద్భుతమైన ఆటతీరుతో గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లాడు. అయితే, ఈ సెట్ ఆరంభంలోనే కొబోలి సర్వీస్‌ను బ్రేక్ చేసి జ్వెరెవ్ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అక్కడి నుంచి వెనుదిరిగి చూడకుండా సెట్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ పాయింట్ గెలిచిన వెంటనే కోర్టుపై పడిపోయి ఆనందంతో భావోద్వేగానికి గురయ్యాడు. ఈ విజయంతో 'మేజర్ టైటిల్ గెలవని ఉత్తమ ఆటగాడు' అనే ట్యాగ్‌ను జ్వెరెవ్ చెరిపేసుకున్నాడు.

## అమెరికాలో మళ్లీ కాల్పులు..

మొదటిపేజీ తరువాయి

కాల్పులకు తెగబడిన నిందితులెవరూ ఇప్పటివరకు పోలీసులకు చిక్కలేదు. వారు ఘటనా స్థలం నుంచి పరారైనట్లు అధికారులు నిర్ధారించారు. పోలీసులు సంఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను, ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలను పరిశీలిస్తున్నారు. పండుగకు వచ్చిన వారు తమ మొబైల్స్‌లో తీసిన ఫోటోలు లేదా వీడియోలను దర్యాప్తు కోసం అందించాలని పోలీసులు కోరారు. ఈ ఘోర కాల్పుల ఘటనను ఒహియో గవర్నర్ మైక్ డివైన్ తీవ్రంగా ఖండించారు.

మొదటిపేజీ తరువాయి

## రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం

### మీకు హిట్లరే స్ఫూర్తి అంటూ ఎద్దేవా

### మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా అని విమర్శ

### తమ పాలన అంబేద్కర్, గాంధీ ఆశయాలకు అనుగుణమని వెల్లడి

### బెంగళూరులో రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా పోస్ట్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. "మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అని పేర్కొన్నారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

మొదటి పేజీ తరువాయి

## 'హైడ్రా'కు హిట్లరే స్ఫూర్తి.. సీఎం రేవంత్ వ్యాఖ్యలతో దుమారం

### హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా ఏజెన్సీని ఏర్పాటు చేశానన్న సీఎం రేవంత్

### బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యలు

### రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తీవ్ర ఆగ్రహం

### ఇది కాంగ్రెస్ హిట్లర్, ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనమన్న బీజేపీ

### చారిత్రకంగా రేవంత్ వాదనలో నిజం లేదంటున్న నిపుణులు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో పెను దుమారం రేపుతున్నాయి. రాష్ట్రంలో ఆక్రమణల తొలగింపు, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) వ్యవస్థకు జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో పేరు పెట్టానని ఆయన స్వయంగా చెప్పడమే ఈ వివాదానికి కారణమైంది. బెంగళూరులో నిన్న జరిగిన 'ది హిందూ' హడిల్ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెరువులు, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై హైడ్రా ఏజెన్సీ తీసుకుంటున్న కఠిన చర్యలను సమర్థించుకుంటూ రేవంత్ రెడ్డి మాట్లాడారు. "హైడ్రా అనే పదం హిట్లర్‌కు చాలా ఇష్టమైనది. ఆయన కోర్ టీమ్‌ను హైడ్రా అని పిలిచేవారు, వారు ఎవరినైనా హతమార్చగలరు. అందుకే నేను హిట్లర్ నుంచి స్ఫూర్తి పొంది దీనికి హైడ్రా అని పేరు పెట్టాను" అని ఆయన వివరించారు. అయితే, రేవంత్ రెడ్డి వాదనలో చారిత్రక నిజం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లర్‌కు 'హైడ్రా' పేరుతో ఎలాంటి హంతక బృందం లేదని, వాస్తవానికి నాజీ జర్మనీపై బ్రిటన్ వైమానిక దళం జరిపిన బాంబు దాడి ఆపరేషన్‌కు ఆ పేరుందని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఇది కాంగ్రెస్ పార్టీ 'హిట్లర్, ఎమర్జెన్సీ మనస్తత్వానికి' నిదర్శనమని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. దీన్ని 'తానాషాహి' (నియంతృత్వం) అని అభివర్ణించారు. గతంలో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ, ఇది కాంగ్రెస్ నైజమని విమర్శించారు. అటు బీఆర్ఎస్ పార్టీ కూడా రేవంత్ వ్యాఖ్యలను ఖండించింది. సోషల్ మీడియాలో సైతం ఈ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

## జైలులో వేస్తారని రాజీపడే, అమ్ముడుపోయే వాళ్లం కాదు

### మేం ఈ దేశ యువత, విద్యార్థులం.. ఇది సుదీర్ఘ పోరాటంధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఉద్యమం మొదలెట్టాంవాళ్లకు సిగ్గులేదు..

### మా అకౌంట్లు హ్యాక్ చేశారు: అభిజీత్ దీప్కే

### జంతర్‌మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' భారీ నిరసన

### వేలాదిగా పాల్గొన్న యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు

### కేంద్ర మంత్రి ప్రధాన్ వారంలోగా రాజీనామా చేయాల్సిందే

### లేకుంటే ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేస్తాం: సీజేపీ

### మద్దతు తెలిపిన విపక్షాలు.. సీజేపీ వెనుక కేజ్రీవాల్: కాంగ్రెస్

**ఢిల్లీ హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక జూన్ 7**

న్యూఢిల్లీ, జూన్ 6: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం నిర్వహించిన నిరసనకు భారీ స్పందన లభించింది. పాఠశాల, కాలేజీ విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ నిరసనకు హాజరయ్యారు. వారిని ఉద్దేశించి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ప్రసంగించారు. 'మిత్రులారా! ఇది సుదీర్ఘ పోరాటం. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతూ సోషల్ మీడియాలో మనం నెల కిందట ఉద్యమం ప్రారంభించాం. కానీ, ఈ వ్యక్తులు (కేంద్ర ప్రభుత్వంలోనివారు) ఎంత సిగ్గులేని వారంటే అతడిపై చర్యలు తీసుకునేబదులు మన సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేయటం, మన పోస్టులను డిలీట్ చేయటం వంటి వాటి మీద దృష్టి పెట్టారు. వాళ్లకు నేను చెప్పేదేమిటంటే.. మీరు మా పోస్టులను తొలగించగలరు. కానీ, మమ్మల్ని ఇక్కడి నుంచి తప్పించలేరు' అని పేర్కొన్నారు. అమెరికా నుంచి తన ప్రయాణాన్ని గుర్తు చేస్తూ.. శనివారం ఉదయం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగే ముందు ఇవే తన జీవితంలో స్వేచ్ఛకు సంబంధించిన చివరి క్షణాలని అనిపించిందని అభిజీత్ దీప్కే చెప్పారు. అయినప్పటికీ, యువత భవిష్యత్తు కోసం తన స్వేచ్ఛను త్యాగం చేయటానికి పూర్తిగా సిద్ధమయ్యాయనన్నారు. తాను భారత్ నుంచి అమెరికాకు వెళ్తున్నప్పటి కంటే అమెరికా నుంచి




తిరిగి వస్తున్నప్పుడే తన తల్లి ఎక్కువగా ఏడ్చారని, భారత్‌లో దిగగానే తనను అరెస్టు చేస్తారని ఆమె భయపడ్డారని వెల్లడించారు. 'ఇది కేవలం మా అమ్మ భయం మాత్రమే కాదు. రాజకీయాల మీద స్పందించే ప్రతీ యువతి, యువకుడి తల్లిదండ్రుల భయం ఇది. ఎంతకాలం భయంలో బతుకుదాం? వారికి (ప్రభుత్వానికి) చెప్పండి.. మేం భయపడటం లేదని' అని పిలుపునిచ్చారు. నిరసనలో పాల్గొన్న ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ మాట్లాడుతూ.. ప్రశ్నాపత్రాలు లీకయ్యాయని ఇంట్లో కూర్చొని ఏడవటమో, రోడ్డు మీదకొచ్చి విధ్వంసం సృష్టించటమో కాకుండా, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతను చూస్తే తనకు ముచ్చటేస్తుందన్నారు. దీప్కేను కాక్రోచ్ ఇన్ చీఫ్(ప్రధాన బొద్దింక)గా అభివర్ణించారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య, సీపీఐకి చెందిన అన్నీ రాజా, వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. సీజేపీకి సంకేతంగా పలువురు కాక్రోచ్ మాస్కులను ధరించారు. ఉదయం 11 నుంచి మొదలైన నిరసన ప్రదర్శన మధ్యాహ్నం 3.30 వరకూ కొనసాగింది. అభిజిత్ దీప్కేకు నలతగా ఉండటంతో నిరసనను ముగించారు. కాగా, నిరసన సమయంలో గందరగోళం సృష్టించటానికి ప్రయత్నిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

# సర్వతోముఖాభివృద్ధికి నిరంతర పోరాటమే నా లక్ష్యం

## : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ నాదర్‌గుల్ 57వ డివిజన్ శేషాద్రి కాలనీలో 87 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజక వర్గంలోని ప్రతి కాలనీని దశలవారీగా అభివృద్ధి చేసి, ప్రజలకు అవసరమైన అన్ని వసతులు అందుబాటు లోకి తీసుకువస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్నామని, అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన పలు హామీల అమలులో విఫలమైందని విమర్శించిన ఎమ్మెల్యే, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన నిలబడతామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను రాజకీయాలకు అతీతంగా చూడాలని, ప్రజల సంక్షేమం మరియు ప్రాంత అభివృద్ధే అందరి లక్ష్యంగా ఉండాలని ఆమె హితవు పలికారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సీసీ రోడ్డు పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలనీల్లో ముంపు సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థలను పటిష్టపరచాలని, చెత్తాచెదారం మరియు పూడికను తొలగించి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు సమ్ రెడ్డి వెంకట్ రెడ్డి, రామిడి రామ్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, తుఫాన్ రెడ్డి, సరిత, సరితా రెడ్డి తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తలసేమియా,సికిల్ సెల్ బాధితుల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు రావాలి

### కాసర్ల శ్రీనివాస్ పిలుపు

### బాధితులు,తల్లిదండ్రులు సంఘటితమై హక్కుల కోసం పోరాడాలని విజ్ఞప్తి



**మంచిర్యాల,జూన్ 7:హైదరాబాద్ మిర్రర్**

తలసేమియా,సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల హక్కుల పరిరక్షణ, మెరుగైన వైద్య సేవల సాధన కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు చెందిన బాధితులు, వారి తల్లిదండ్రులు ఐక్యంగా ముందుకు రావాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ నాయకుడు కాసర్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ యాజమాన్యం నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ అన్ని గ్రూపుల రక్తాన్ని అందుబాటులో ఉంచుతోందని తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తలసేమియా బాధితులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బాధితులకు అవసరమైన వైద్య సేవలు, వికలాంగుల ధ్రువపత్రాల సాధన, ప్రభుత్వ ఆసుపత్రుల్లో హైడ్రాక్సియూరియా వంటి అత్యవసర మందుల నిరంతర సరఫరా కోసం అనేక విజయవంతమైన ఉద్యమాలు నిర్వహించినట్లు ఆయన గుర్తుచేశారు. కరీంనగర్ జిల్లాలో కూడా మంచిర్యాల మాదిరిగానే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ద్వారా తలసేమియా బాధితులకు ఉచిత ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పించాలని, ఆరోగ్యశ్రీ పరిధిలో పూర్తి స్థాయి ఉచిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సహా అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో మెరుగైన చికిత్స, అవసరమైన మందుల ఉచిత మరియు నిరంతర సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. హక్కులు అడిగితే రావని, సంఘటిత పోరాటాల ద్వారానే సాధ్యమవుతాయని పేర్కొన్న ఆయన, బాధితులు మరియు వారి కుటుంబ సభ్యులు ఐక్యంగా నిలిచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక స్థాయిలో నాయకత్వం వహించేందుకు ముందుకు వచ్చే వారితో కలిసి తలసేమియా, సికిల్ సెల్ బాధితుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మన పిల్లల ఆరోగ్యకరమైన, ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి బాధిత కుటుంబం ఉద్యమంలో భాగస్వాములు కావాలని అన్నారు.

# సమగ్ర అభివృద్ధితోనే గుర్తింపు

## : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రశాంత్ హిల్స్, జిల్లెలగూడ డివిజన్‌లలో సుమారు 1.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీలు మరియు నివాస ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందితేనే ఆ ప్రాంతానికి మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు నియోజకవర్గాల అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే వినియోగించబడేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అంతేకాకుండా, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలనీల్లో ఎలాంటి ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థలను పూర్తిస్థాయిలో పరిశీలించి, చెత్తాచెదారం, పూడిక మరియు వ్యర్థాలను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అర్కల కామేష్ రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, అర్కల భూపాల్ రెడ్డి, నర్సిరెడ్డి, దిండు భూపేష్ గౌడ్, అనిల్ యాదవ్, సిద్దాల చిన్న బీరప్ప, లక్ష్మణ్ ముదిరాజ్, సిద్దాల అంజయ్య, మదారి రమేష్, విజయ్, గోపి యాదవ్, ప్రవీణ్ రెడ్డి, సునీత బాలరాజ్, లలిత జగన్, పంతంగి మాధవి, సుర్విలత, బిందు తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు

**హైదరాబాద్(హైదరాబాద్ మిర్రర్)**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు మామిడి సోమయ్య 60వ జన్మదిన వేడుకలు ఆదివారం పలు చోట్ల ఘనంగా జరిగాయి. వివిధ జిల్లాలలో ఫెడరేషన్ నాయకులు కేక్ కట్ చేసి, పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేదలు, అనాధలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. జర్నలిస్టు ఉద్యమ నేత మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు హైదరాబాద్ లో ఘనంగా జరిగాయి. వనస్థలిపురంలోని శాంతినికేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల సంస్థలో ఆయన స్వయంగా వెళ్ళి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు బాలేశ్వర్, జర్నలిస్టులు యర్రమిల్లి రామారావు, అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, స్రామాట్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ, ఏవీఎన్ టీవీ కార్యాలయంలో సిబ్బంది సోమయ్య చే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్ కుమార్ గౌడ్, ఎల్బీనగర్ నియోజకవర్గం కోశాధికారి నంబి ప్రసాద్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు వైజీఎస్ రామారావు తదితరులు మామిడి సోమయ్య కు శాలువా కప్పి పూల బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లిబర్టీలోని కార్యాలయంలో మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు జరిపారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సోమయ్యతో కేట్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అడ్ హక్ కమిటీ కన్వీనర్ రవి కుమార్, కో-కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్,ఎస్ 9 రవికుమార్, సంతోష్ కుమార్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సోమయ్య కు శాలువాలు, బొకేలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




# స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలి

## : సింధు ఆదర్శ్ రెడ్డి





**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 07:**

భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ సొసైటీ కార్యాలయం సమీపంలో డిజిటల్ మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమృద్ధి డిజిటల్ మార్కెటింగ్ కార్యక్రమానికి భారతి నగర్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ఆమె పరిశీలించి వారి ప్రతిభ, కృషిని అభినందించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు డిజిటల్ మార్కెటింగ్ వేదికలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, ఉపాధి పథకాలపై అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. మహిళా సాధికారత సాధనలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ మహిళా సంఘం అధ్యక్షురాలు సమీరా, కార్యదర్శి కాత్యాయనీ, సభ్యులు సుష్మిత, అనూష, వై.వి. అనూష, ఈశ్వరాంబ మహిళా సొసైటీ కార్యదర్శి సత్యవతి, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.





# పెద్దమ్మ గుడి వద్ద షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నీలం మధు

- సొంత నిధులతో ముందుకొచ్చిన నీలం మధు ముదిరాజ్
- భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణానికి శ్రీకారం
- సొంత నిధులతో సేవా కార్యక్రమం చేపట్టిన నీలం మధు
- పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అర్చనలు
- వేలాది మంది భక్తులకు ఉపశమనం కలిగేలా చర్యలు
- ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా ముందడుగు
- ఆలయ కమిటీ సభ్యుల ఘన సన్మానం
- త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని హామీ
- ఆధ్యాత్మిక సేవలోనూ ముందుంటానన్న నీలం మధు
- భక్తుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత
- ఇస్నాపూర్ పెద్దమ్మ ఆలయానికి మెరుగైన వసతులు

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 07:**

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్ పెద్దమ్మ దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న నూతన షెడ్డు నిర్మాణ పనులకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎండ, వానల కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఆయన, ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా సొంత నిధులతోనే షెడ్డు నిర్మాణాన్ని చేపట్టేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మల్లేశ్వరి కుమారుడు మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్, పెద్దమ్మ తల్లికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం భూమిపూజ చేసి షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి నిర్మాణ వ్యయాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్నాపూర్ పెద్దమ్మ దేవాలయానికి ప్రతి వారం వేలాది మంది భక్తులు వస్తుంటారని, ముఖ్యంగా పండుగలు, జాతరల సమయంలో సరైన నీడ లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భక్తులకు కనీస వసతులు కల్పించాలనే సంకల్పంతోనే ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. భక్తుల ఇబ్బందులను గుర్తించి సొంత ఖర్చులతో షెడ్డు నిర్మాణానికి ముందుకొచ్చిన నీలం మధును ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరి మణికంఠ, కౌన్సిలర్లు మన్నె రాఘవేంద్ర, వెంకటేష్ నాయక్, సంగన్నగారి గోపాల్, సందీప్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్ర, శంకర్, సంజీవ, ఆంజనేయులు, కృష్ణ, రాజు, మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.









## సీతారాముల తిరుకల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 07:**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్‌లో నిర్వహించిన శ్రీ భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వి. ఆదర్శ్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేసిన ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సత్సంబంధాలను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. తిరుకల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య కురుమ, మాజీ వార్డు సభ్యుడు రాజేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, పరమేష్ యాదవ్, చిన్న, అప్పల భాస్కర్, శ్రీకాంత్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.





## జేపీ కాలనీలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పర్యటన

### పాల్గొన్న బిఅరెస్ యువనేత మాద్రి పృథ్వీరాజ్

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 07:**

పటాన్‌చెరు జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యటన కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృషి డిఫెన్స్ కాలనీ, గౌతమ్ నగర్ కాలనీలలో పర్యటించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనపై స్థానికులతో చర్చించారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, నర్ర భిక్షపతి, కాలనీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## వీరభద్రీయుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 7:**

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని వీరభద్రీయుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ వీరభద్రీయుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముత్తంగి డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న సంఘ భవన స్థలంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే తన లక్ష్యమని పేర్కొన్నారు. వీరభద్రీయుల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇస్నాపూర్ వీరభద్రీయుల సంక్షేమ సంఘం కోసం ఇప్పటికే తన సొంత నిధులతో 200 గజాల స్థలాన్ని అందించిన విషయాన్ని గుర్తు చేశారు. సంఘ భవన నిర్మాణం పూర్తయ్యాక సమాజానికి మరింత ఉపయోగపడే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా సంఘానికి అవసరమైన సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ నాయకుడు యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, కుమార్ గౌడ్, ప్రభాకర్, మేరాజ్ ఖాన్, సందీప్, రామకృష్ణ, సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్, పటాన్‌చెరు అధ్యక్షుడు చవ్వ కొండల్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యం కూడా అవసరం

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్ 57వ డివిజన్, నాదర్‌గుల్ గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ వాసన్స్ కరాటే అకాడమీని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి సమాజంలో పిల్లలకు విద్యతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని అన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, క్రమశిక్షణ, ధైర్యం, శారీరక దృఢత్వాన్ని కూడా పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు స్వీయ రక్షణలో నైపుణ్యం సాధించడం కాలానుగుణ అవసరమని, ఇలాంటి శిక్షణా కేంద్రాలు మరింతగా ముందుకు వచ్చి పిల్లలకు నాణ్యమైన శిక్షణ అందించాలని ఆకాంక్షించారు. యువతను క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ వైపు ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యవంతమైన, చైతన్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం కరాటే శిక్షణలో ప్రతిభ కనబరిచి వివిధ బెల్ట్ స్థాయిలను సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్చాల సుదర్శన్ రెడ్డి, మర్రి నరసింహారెడ్డి, అంకం గారి కుమారి గౌడ్, దండు యాదయ్య, బాత్క రవి కుమార్ , కొండ విజయ్, కొడారి సందీప్ యాదవ్, పెంటయ్య , అకాడమీ నిర్వాహకులు, కరాటే శిక్షకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## అగ్రికల్చర్ కాలనీ ఎన్నికల్లో

# బుచ్చిరెడ్డి ప్యానెల్ ఘన విజయం.





- అధ్యక్షుడిగా తేరా బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్ రాంరెడ్డి, ట్రెజరర్‌గా కాయితి చిన్నారెడ్డి ఎన్నిక
- కాలనీ అభివృద్ధే లక్ష్యమని విజేతల హామీ
- భారీ విజయోత్సవ ర్యాలీ, రామాలయంలో ప్రత్యేక పూజలు
- ఆత్మగౌరవ పోరాటానికి కాలనీ వాసుల మద్దతు: విజేతల వ్యాఖ్య

**హైదరాబాద్ మిర్రర్, ఎల్బీనగర్ :**

హస్తినాపురం అగ్రికల్చర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో తేరా బుచ్చిరెడ్డి ప్యానెల్ భారీ విజయాన్ని నమోదు చేసింది. అధ్యక్షుడిగా తేరా బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్ రాంరెడ్డి, ట్రెజరర్‌గా కాయితి చిన్నారెడ్డి విజయం సాధించారు.విజయం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తేరా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన విజయానికి సహకరించిన కాలనీ వాసులు, మద్దతుదారులు మరియు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఎన్నికలు ధర్మానికి, ఆత్మగౌరవానికి జరిగిన పోరాటమని ప్రధాన కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి, ట్రెజరర్ కాయితి చిన్నారెడ్డి పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ విజయానికి వసంత ఆర్కే అపార్ట్‌మెంట్స్‌కు చెందిన సి.హెచ్. మారుతి చేపట్టిన పోల్ మేనేజ్‌మెంట్ కీలక పాత్ర పోషించిందని నాయకులు తెలిపారు.అనంతరం విజేతల ప్యానెల్ ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం శ్రీ రామాలయం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కాలనీ అభివృద్ధి కోసం సంకల్పం చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ సొసైటీ డైరెక్టర్ చిట్టిపోలు రాము నేత, మాజీ అధ్యక్షులు తాండ్ర మైపాల్ రెడ్డి, రామిడి వెంకటరమణారెడ్డి, గడ్డం విష్ణువర్ధన్ రెడ్డి, సందీప్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, గుద్దేటి భాస్కర్ నేత, రఘు మారెడ్డి, సత్యశిలా రెడ్డి, వీరారెడ్డి, రాజారెడ్డి, మెగా రెడ్డి తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

## కృషి డిఫెన్స్ కాలనీ లో పర్యటించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 07:**

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం మాజీ ప్రజా ప్రతినిధులు, బల్దియా అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో వర్షపు నీరు బయటకి వెళ్లకపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. అతి త్వరలో వర్షపు నీరు తరలించేందుకు ప్రత్యేక డ్రైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం డిఈ కృష్ణవేణికి ఆదేశించారు. హైమాస్ట్ లైట్లు, బిటి రెన్యువల్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల కోరిక మేరకు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల ప్రార్థన మందిరాల నిర్మాణం కోసం వివాదాలు లేకుండా కాలనీలోనే స్థలాలు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కాలనీలో గల ఇండోర్ స్టేడియం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, శ్రీరాములు, బలవంత్, వెంకటేష్, కాలనీ అధ్యక్షులు అమరేందర్, మాణిక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు..

# ఊరంతా ఒక్కటై!

- అభివృద్ధి పథంలో సంస్థాన్ నారాయణపురం
- సర్పంచ్ నిర్ణయం పూర్తి అండగా ఉంటాం:
- సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి
- అభయ ఫౌండేషన్ చైర్మన్ సుంకు బాలచందర్ స్వామీజీ
- నారాయణపురం ముద్దుబిడ్డలు, పురప్రముఖులు

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 07(హైదరాబాద్ మిర్రర్ ):**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి , పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంస్థాన్ నారాయణపురం డెవలప్మెంట్ కమిటీ మీటింగ్ కు ముఖ్య అతిథులుగా హాజరైన సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి రాజ్ గోపాల్ రెడ్డి, అభయ ఫౌండేషన్ చైర్మన్ సుంకు బాలచందర్ స్వామీజీ,నారాయణపురం ముద్దుబిడ్డలు, పురప్రముఖులు హాజరై మాట్లాడుతూ సర్పంచ్, పాలకవర్గం తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదని అన్నారు. ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విద్య,వైద్యం, ఉపాధి అనే నినాదంతో ముందుకు సాగుతున్న ఈ కమిటీ చాలా గొప్ప నిర్ణయం అని ఉన్నారు. మా వంతు సాయం సహకారాలు మీకు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా అన్నారు. నారాయణపురంలో పుట్టి పెరిగి, ప్రయోజకులైన వివిధ రంగాలలో ఉద్యోగాలు చేస్తూ, రిటైర్డ్ ఆఫీస్ ఆఫీసర్లు, పారిశ్రామికవేతలు, మేధావులు ఊరు మీద ప్రేమతో సంస్థాన్ నారాయణపురం డెవలప్మెంట్ మీటింగ్ కు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ పుర ప్రముఖులు, వైస్ ఛాన్సర్లు, మాజీ సర్పంచులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, యువజన సంఘ నాయకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.










## రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

### వ్యవసాయ సహకార సంస్థల ఎన్నికలపై నిర్లక్ష్యం ఎందుకు : కొలను శంకర్ రెడ్డి

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చినటువంటి వాగ్దానాలు నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని భారత జనతా పార్టీ రాష్ట్ర నాయకులు కొలను శంకర్ రెడ్డి ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సరైన సమయంలో నిర్వహించకపోవడంతో ప్రజలకు అందాల్సిన అభివృద్ధి ఫలాలు అందలేకపోతున్నాయని, అంతేకాకుండా పట్టణ గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కుంటుపడుతోందని, ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలం కావడంతో ఏర్పడిన ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే స్థానిక సంస్థలైన జడ్పిటిసి, ఎంపీటీసీ, జిహెచ్ఎంసి ఎన్నికలే కాకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థల ఎన్నికలను కూడా నిర్వహించలేకపోయి కాంగ్రెస్ నాయకులను నామినేట్ చేయడం అంటే సీఎం రేవంత్ రెడ్డికి పాలనపై పట్టు లేకపోవడమే ప్రధాన కారణమని, రైతులకు వెన్నుముకగా ఉన్నటువంటి సింగిల్ విండో సొసైటీ సహకార బ్యాంకులకు ఎన్నికల పదవీకాలం ముగిసిపోయిన ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేయడమే కాకుండా కాంగ్రెస్ నాయకులు నామినేట్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ముఖ్యంగా రైతులకు అందవలసిన అభివృద్ధి ఫలాలు అందేందుకు వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నానని కొలను శంకర్ రెడ్డి తెలిపారు.







## మైనర్ బాలిక అదృశ్యం

**బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)**

బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాహిన్ నగర్ లో నివాసం ఉండే మైనర్ బాలిక మెడిసిన్ కోసం బయటికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో బాలాపూర్ పోలీస్ స్టేషన్లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడం జరిగింది. షాహిన్ నగర్ లో నివాసం ఉండే హమీద్ ఖాన్ మరియు జులీశా బేగం దంపతుల కూతురు మహేక్ తన సోదరి కి ఈనెల 5న మధ్యాహ్నం సమయాన మందులు తీసుకొస్తానని షాప్ కి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో బాలిక తల్లిదండ్రులు బంధువుల ఇంట్లో చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని, ఆచూకీ తెలిసినవారు బాలాపూర్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని తెలిపారు.

## కల్కి భగవాన్ కల్యాణోత్సవం లో పాల్గొన్న జగ్గారెడ్డి

**సంగారెడ్డి హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక జూన్ 7 :**



సంగారెడ్డి పట్టణం లో పిఎస్ఆర్ గార్డెన్ లో కల్కి భగవాన్ భక్త బృందం ఆధ్వర్యం లో కల్కి భగవాన్ మూర్తులకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. కల్కి భగవాన్ దంపతుల విగ్రహ మూర్తులకు పూలమాలలు సమర్పించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కల్కి భగవాన్ కృపా కటాక్షాలు ప్రజలందరి పై ఉండాలని , ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించాలని ఆకాక్షించారు. ప్రతీ ఏటా క్రమం తప్పకుండా కల్యాణం నిర్వహిస్తున్న కల్కి భగవాన్ భక్త బృందాన్ని ఆయన అభినందించారు.కల్కి భగవాన్ ఆలయ కోసం స్థలాన్ని సేకరించామని , ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఆలయ నిర్మాణం కోసం తన పూర్తి సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగా కల్కి భక్త బృందానికి జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కల్కి భక్త బృంద సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాల వలన పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలి

### మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్ మిర్రర్ న్యూస్, జూన్ 7:**

ఉచిత వైద్య శిబిరాల వలన పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్ట లోని ప్రభుత్వ పాఠశాల లో వీ పర్ ఉమెన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బి పి పరీక్ష చేయించుకోగా నార్మల్ గా ఉంది. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలలో సురాష్ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఉచిత వైద్య శిభిరాలలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వలన మన ఆరోగ్య పరిస్థితి తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రయివేట్ హాస్పిటల్ కు వెళ్ళి పరీక్షలు చేయించుకోవాలంటే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలలో మరిన్ని వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, కిరణ్మయి, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, నాయకులు కిషోర్, శ్రీహరి, సతీష్, కొండాపురం మహేష్ యాదవ్, సంజయ్, కిరణ్, గణేష్, రాకేష్, శిబిరం నిర్వాహకులు ప్రతిభ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## హస కొత్తూరులో మహిళ సంఘాల భవనాలకు భూమిపూజ చేసిన

### సర్పంచ్ రేవతి గంగారెడ్డి

**హైదరాబాద్ మిర్రర్ న్యూస్ జూన్ 7:**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్‌పల్లి మండలంలోని హసకొత్తూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న రెండు స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) భవనాలకు గ్రామ సర్పంచ్ నలిమేల రేవతి గంగారెడ్డి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి, సమావేశాలు మరియు స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఈ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని,వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు గ్రామపంచాయతీ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కుందేటి శ్రీనివాస్,కనుక నర్సయ్య, కల్లెడ కాశవ్వ,పసుల గంగు,ఐకేపీ సీసీ అలేఖ్య, వీవోలు వీణ,సాగరిక, రమ్య, వీవో అధ్యక్షులు మంద భాగ్య,విమల, లయతో పాటు మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మహిళా సాధికారతకు మరో అడుగు.. నాలుగు మహిళా సంఘ భవనాల నిర్మాణానికి భూమిపూజ

**ఆలూర్ జూన్ 7 హైదరాబాద్ మిర్రర్**

గ్రామీణ ప్రాంత మహిళల అభివృద్ధి, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీడీఓ గంగాధర్ అన్నారు. ఆలూర్ మండలంలోని ఆలూర్, గుత్ప, రామచంద్రపల్లి గ్రామాల్లో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న నాలుగు మహిళా సంఘ భవనాలకు ఆదివారం ఎంపీడీఓ గంగాధర్, డీఈ కిషన్, సంబంధిత గ్రామాల సర్పంచులు ముక్కెర విజయ్, తోగర్ల భూషణ్, కొండ్ర దశరథ్‌లు సంయుక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల కార్యకలాపాలకు ప్రత్యేక భవనాలు ఎంతో అవసరమని తెలిపారు. ఇప్పటి వరకు సమావేశాల నిర్వహణ, సంఘ రికార్డుల భద్రపరిచే విషయంలో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కొత్తగా నిర్మించనున్న భవనాలు మహిళా సంఘాలకు శాశ్వత వేదికలుగా నిలిచి వారి కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నితీష్, సీసీలు మనోహర్, ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, శశి, జితేందర్, సతీష్, మహిళా సంఘ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





## భీంగల్ విషాదం బాధాకరం..

## బాధిత కుటుంబాలకు అండగా వేముల ప్రశాంత్ రెడ్డి

### బాధిత కుటుంబాలకు రూ.18000 వేల ఆర్థిక సాయం, ప్రమాదానికి కారణమైన కుంటను పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్ మిర్రర్ న్యూస్, జూన్ 7:**

నిజామాబాద్ జిల్లా భీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని లింబాద్రిగుట్ట వద్ద జరిగిన ముగ్గురు చిన్నారుల మృతిపై బాల్కొండ మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రెండు నిరుపేద కుటుంబాలకు చెందిన ముగ్గురు చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి వారు నివాసం ఉంటున్న గుడిసెల వెనుక ఉన్న బ్రాహ్మణ నీటి కుంటలో పడి మృతి చెందడం అత్యంత విషాదకరమని అన్నారు. ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, చిన్నారులను కోల్పోయిన తల్లిదండ్రులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల ఆవేదన మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు. ఈ ఘటనలో కుమార్తె,కుమారుడిని కోల్పోయిన ఓ తల్లి తీవ్ర మనోవేదనతో అదే కుంటలో దూకేందుకు ప్రయత్నించి కాలికి గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. చికిత్సకు సంబంధించిన ఎలాంటి బిల్లులు తీసుకోవద్దని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవో తదితర అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అన్ని విధాల సహాయం అందించాలని కోరారు. వారికి పక్కా ఇల్లు మంజూరు చేసే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదానికి కారణమైన నీటి కుంటను పరిశీలించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి,ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా



కుంట చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడం లేదా అవసరమైతే కుంటను పూడ్చివేయడం వంటి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఘటన స్థలాన్ని వెంటనే సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు తక్షణ ఖర్చుల నిమిత్తం రూ.18 వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అందజేసి తమ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## వేసవి శిక్షణా తరగతులు విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడానికి దోహదం చేస్తాయి తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు వై వి బి రాజేంద్ర ప్రసాద్

**(ఉయ్యూరు హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక జూన్ 7 )**

గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణాతరగతుల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ. వేసవి సెలవల్లో విద్యార్థులు ఇళ్లల్లో ఉంది ఫోన్ టీవీ చూస్తూ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించడం వలన పిల్లలలో సృజనాత్మకత పెరుగుతుందని ,చదువుపట్ల భయాన్ని పోగొట్టి పోటీతత్వాన్ని అలవర్చుకుంటారని గ్రంథాలయం అంటే తెలియని నేటి చిన్నారులకు ఈ శిక్షణా తరగతుల వలన ప్రతి రోజు వెళ్ళి పుస్తక పఠనం వలన లోకజ్ఞానం పెరుగుతుందని అన్నారు, ఉయ్యూరు సీఐ రామారావు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరు తమ జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్య సాధన కోసం కష్టపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధికారి బి రమణి గుర్రాల మధు చిందా కుటుంబరావు మాజీ కౌన్సిలర్ కోరాడ వెంకట లక్ష్మి దండమూడి కిషోర్ తదితరులు పాల్గొన్నారు



## సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గా "వడ్డేపల్లి " నియామకం.

**గోదావరిఖని 07 హైదరాబాద్ మిర్రర్**



లిఈరోజు సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం జనరల్ బాడీ సమావేశం భూపాల్ పల్లిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా అఖిలభారత బొగ్గు గనుల ఇంచార్జ్ ముఖ్యఅతిథికి విచ్చేశారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర బిఎమ్ఎస్అధ్యక్షులు కల్లాల శ్రీనివాస్ వ్యవహరించడం జరిగింది. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ:- అధ్యక్షులుగా అప్పాని శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి కుమారస్వామి కార్యనిర్వాహక అధ్యక్షునిగా యాదగిరి సత్తయ్య, ట్రెజరర్ గా సాయి వేణి సతీష్ తదితరులను ఎన్నుకోవడం జరిగింది. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసిన కార్మికులకు కార్మిక నాయకులకు రాష్ట్రకమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదములు తెలిపినారు.

## ఘనంగా ఆత్మీయ వీడ్కోలు!

### గూడూరులో ఘనంగా అటవీ శాఖ ఉద్యోగుల వీడ్కోలు సభ

**తెలంగాణ జూన్ 7 ( హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక ):**

మహబూబాబాద్ జిల్లా::::గూడూరు మండల పరిధిలో ఇటీవల బదిలీ అయిన పలువురు అటవీ శాఖ ఉద్యోగుల "ఉద్యోగ బదిలీ మహోత్సవ ఆత్మీయ వీడ్కోలు" కార్యక్రమం అటవీ శాఖ కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగింది. తోటి ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు కలిసి ఈ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సహోద్యోగులు మాట్లాడుతూ, బదిలీపై వెళ్తున్న అధికారులు, సిబ్బంది గూడూరు మండలంలో అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. విధి నిర్వహణలో వారు చూపిన ప్రతిభ, ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఘన సన్మానం: బదిలీ అయిన అటవీ శాఖ డివిజన్ అధికారి చెంద్రశేఖర,రెంజ్ అధికారి సురేష్ లను స్థానిక నాయకులు, తోటి సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహుకరించారు. వారి భావి జీవితం, రాబోయే కొత్త బాధ్యతలు మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. బదిలీ అయిన ఉద్యోగుల భావోద్వేగ ప్రసంగం "గూడూరు మండల ప్రజలకు సేవ చేయడం ఒక మంచి అనుభూతిని ఇచ్చింది. ఇక్కడ తోటి సిబ్బంది, ప్రజలు అందించిన సహకారం మరువలేనిది. అని బదిలీ అయిన ఉద్యోగుల భావోద్వేగ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, అటవీ శాఖ అధికారులు, ఇతర శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## పోగొట్టుకున్న ఫోన్లను అప్పగించిన ఎస్ హెచ్ ఓ

**ఆర్మూర్, హైదరాబాద్ మిర్రర్, జూన్ 7 :-**

ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయినటువంటి మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి 6 బాధితులకు ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ మొబైల్ ఫోన్ లను అప్పగించారు. ఇందులో భాగంగా ఒక సంవత్సరం లోపు రెండు మొబైల్స్, 5 నెలల్లోపు 3 మొబైల్లు, రెండు సంవత్సరాలు ఒక్క మొబైల్ ఇవ్వడం జరిగింది. విజయ్ కుమార్ రాజు, ముత్యమ్మ, దారం ప్రకాష్, బాలు, భరత్ రాజ్, సురేందర్ లకు పోగొట్టుకున్న ఫోన్లను అప్పగించారు.



## రైతు మృతిపై సంతాపం: కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన

### ఎమ్మెల్యే వేముల వీరేశంగారు

**హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక జూన్ 7**

లినకిరేకల్ నియోజకవర్గం:నిన్న కొయెడ సీఎం సభ కు వెళ్లి వస్తూ బస్సులో గుండె పోటుతో చనిపోయిన చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ వాసి పప్పుల ఎల్లయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ ఎ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంఅనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం తరపున రూ.2 లక్షల ఆర్థిక సహాయ చెక్కును అందజేశారు. అదేవిధంగా తన వ్యక్తిగత సహాయంగా ఆ కుటుంబానికి రూ.50 వేలు అందించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



## పలువురిని పరామర్శించిన

### మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**నారాయణఖేడ్ జూన్ 07 హైదరాబాద్ మిర్రర్**

నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన రాజులు సెట్ మరియు సంగెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రవీందర్ పటేల్ గారి సోదరులు పెద్ద నాగేందర్ పటేల్ ఉపసర్పంచ్ శ్రీనివాసరావు పటేల్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రావు పాటిల్, సర్పంచ్ ధర్మానాయక్, మాజీ సర్పంచ్ రవీందర్ రావు పటేల్, వెంకట్రావు పటేల్,అశోక్ రావు, నర్సాగౌడ్, బాబు, తుకారం, నవీన్ గౌడ్, తదితరులు ఉన్నారు.






# గోదావరి జలాలపై తెలంగాణకు అన్యాయం జరగనివ్వం:

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం -- హరీశ్‌రావు

**హైదరాబాద్, జూన్ 7 ( హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక ):**

గోదావరి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగనివ్వబోమని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టీ. హరీశ్‌రావు స్పష్టం చేశారు. గోదావరి--బనకచర్ల ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరాటం వల్లే ప్రభుత్వం స్పందించాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతోందన్నారు. ప్రభుత్వం సరైన సమాధానాలు ఇవ్వలేని పరిస్థితుల్లో వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని ఆరోపించారు. తమపై విమర్శలు చేసినా, తెలంగాణ హక్కుల కోసం ప్రశ్నించడం ఆపబోమని స్పష్టం చేశారు.గతంలో కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, ప్రస్తుతం గోదావరి జలాల విషయంలో కూడా అదే పరిస్థితి నెలకొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరిలో అదనపు జలాలు లేవని, అయినప్పటికీ వాటిని ఇతర ప్రాంతాలకు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కావేరి--గోదావరి నదుల అనుసంధానం పేరుతో పోలవరం నుంచి గోదావరి జలాలను తరలించేందుకు ప్రయత్నిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. నదుల అనుసంధానానికి తాము వ్యతిరేకం కాదని, అయితే తెలంగాణ ప్రయోజనాలు కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ఇచ్ఛంపల్లి లేదా సమ్మక్క సాగర్ నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తాము




ముందుంచామని, అలా చేస్తే తెలంగాణకు కూడా గోదావరి జలాలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణకు కేటాయించిన నీటి వాటాను పూర్తిగా వినియోగించిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని తరలించాలని, కావేరికి మళ్లించే నీటిలో తెలంగాణకు కూడా సముచిత వాటా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు.గోదావరి జలాల విషయంలో తెలంగాణ హక్కులను పరిరక్షించేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని టీ. హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# సీనియర్లకు ప్రాధాన్యత ఎక్కడ?

## టీడీపీ రాజ్యసభ ఎంపికలపై

## రాజకీయ దుమారం

**(ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక జూన్ 7)**

అధికార పక్షమైన తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ వంటి పేర్లు తెరపైకి రావడం... దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని, వాయిస్ వినిపిస్తున్న సీనియర్ దళిత నేత వర్ల రామయ్యకు మరోసారి నిరాశే ఎదురవడం తీవ్ర చర్చకు దారితీసింది.?సామాజిక న్యాయం నినాదమా నిబద్ధతా ఎలక్షన్ ముందు చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో సామాజిక న్యాయం, అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత అని ప్రకటించిన కూటమి ప్రభుత్వం... అత్యున్నత సభ అయిన రాజ్యసభకు ఎస్సీ సామాజికవర్గం నుండి ఎవరినీ ఎంపిక చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.కార్యకర్తల ఆవేదన పార్టీ కోసం అన్ని కాలాల్లోనూ అండగా నిలబడి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గట్టిగా గళం వినిపించిన వర్ల రామయ్య లాంటి సీనియర్లకే గుర్తింపు లేకపోతే, సాధారణ కార్యకర్తల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. వర్ల రామయ్య వంటి సీనియర్ నేతలకు ?ఏది ఏమైనప్పటికీ, ఓట్ల రాజకీయం ముగిసిన తర్వాత పదవుల పంపకాల్లో సామాజిక సమతుల్యత దెబ్బతింటే అది పార్టీ క్యాడర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందంటున్నారు విశ్లేషకులు. దళితుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవుల భర్తీలోనైనా ఈ అసంతృప్తిని ఎలా చల్లారుస్తుందో చూడాలి

# ప్రభుత్వం వంజరి కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి

### విద్య,ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ అవసరం నిజామాబాద్ జిల్లా వంజరి సంఘం ఆర్గనైజేషన్ నాయకుడు ఆమంద్ అశోక్

**హైదరాబాద్ మిర్రర్ న్యూస్, నిజామాబాద్:**



తెలంగాణ రాష్ట్రంలో వంజరి కులస్తులను ప్రత్యేక సామాజిక వర్గంగా గుర్తించి వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిజామాబాద్ జిల్లా వంజరి సంఘం ఆర్గనైజేషన్ నాయకుడు ఆమంద్ అశోక్ డిమాండ్ చేశారు.ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్ల మాదిరిగానే వంజరి కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేసి విద్య,ఉపాధి,స్వయం ఉపాధి అవకాశాలు,ఆర్థిక సహాయం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలోని వంజరి కుటుంబాలు సామాజికంగా,ఆర్థికంగా వెనుకబడిన పరిస్థితుల్లో ఉన్నాయని,వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సమర్థవంతంగా అందుతాయని అన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, యువతకు ఉపాధి అవకాశాలు,మహిళలకు స్వయం ఉపాధి రుణాలు, చిన్న వ్యాపారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించే విధంగా కార్పొరేషన్ పనిచేయాలని సూచించారు.వంజరి సమాజం అభివృద్ధి చెందితే రాష్ట్ర అభివృద్ధికి కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్న ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి వంజరి కార్పొరేషన్ ఏర్పాటు దిశగా తక్షణమే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వంజరి కులస్తుల ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

# బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్ష పదవి రేసులో షేక్ చాంద్ పాషా

**వైరా నియోజకవర్గహైదరాబాద్ మిర్రర్**




ఖమ్మం జిల్లా, వైరా నియోజకవర్గం, ఏన్కూర్ మండలానికి చెందిన షేక్ చాంద్ పాషా బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్ష పదవి రేసులో ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తుంది. బీఆర్ఎస్ పార్టీ మొదటి కాలం నుండి పార్టీ అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అన్ని పనుల్లో తానే ముందు ఉండి నడిపించేవారు. వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ గెలుపులో, తర్వాత స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన లావుడ్య రాములు నాయక్ గెలుపులో షేక్ చాంద్ పాషా కీలక పాత్ర పోషించారని ఆయన అనుచరులు పేర్కొన్నారు. ఏన్కూర్ మండల బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడిగా మొదలుపెట్టిన ఆయన ప్రయాణం, పార్టీ అధికారంలో ఉన్న, అధికారం లేకపోయినా ఏనాడూ పార్టీని విడిచిపెట్టలేదు. ప్రస్తుత వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు, బానోత్ మంజుల తో మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన షేక్ చాంద్ పాషా కు జిల్లా అధ్యక్ష పదవి దక్కితే మైనార్టీ వర్గాల్లో మరింత విశ్వాసం పెరిగి, పార్టీ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

# నూతన హాస్పిటల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నా

## రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి

**నారాయణఖేడ్ జూన్ 07 హైదరాబాద్ మిర్రర్**

నారాయణఖేడ్ నియోజకవర్గ సిర్గాపూర్ మండలం కేంద్రంలో నూతన హాస్పిటల్ ను సర్పంచ్ శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించి వారికి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల పట్లోల చంద్రశేఖర్ రెడ్డి నూతన హాస్పిటల్ ను కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేపించి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పేదలకు సేవ చేసే బాగ్యం డాక్టరర్లకు మాత్రమే ఉంటుంది అని వారు డాక్టర్ శివకుమార్ గారికి సూచించారు . వారితోపాటు శ్రీనివాస్ రావ్ సర్పంచ్. రాణాప్రతాప్ .యాదవ్ రెడ్డి. విఠల్ రావ్. జైరాజ్ మాజీ సర్పంచ్ లు. సంజీవ్ సర్పంచ్ కేశ్వర్ .బీ రాజు కౌన్సిలర్.విఠల్ నాయక్ ఉపసర్పంచ్ రమేష్. తుకారాం .కృష్ణ ఎస్సి సెల్ కాంగ్రెస్ మండలం అధ్యక్షులు.సురేష్.సంగెమ్ తుకారాం .జామిల్. విఠల్ రెడ్డి ఉపసర్పంచ్.వార్డ్ సభ్యులు..కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఈ నెల 8న సోమవారం ఉదయం కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం

**హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక జూన్ 7**



ఈ నెల 8న సోమవారం ఉదయం కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చున్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# హిందువు ప్రశ్నిస్తే కాంగ్రెస్ వాడివి అంటారు,ముస్లిం ప్రశ్నిస్తే పాకిస్తానీ" అని ముద్ర వేస్తారు

**(న్యూఢిల్లీ హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక జూన్ 7 )**



సిక్కు ప్రశ్నిస్తే ఖలిస్తానీగా చిత్రిస్తారు,క్రైస్తవుడు ప్రశ్నిస్తే మతమార్పిడి"అని తేల్చేస్తారుఆదివాసీ అడిగితే నక్సలైట్‌అని గర్జిస్తారు,కలం పట్టిన వాడు మాట్లాడితే దేశద్రోహి అని అరుస్తారుప్రశ్నలన్నీ నేరాలైతే, ప్రజాస్వామ్యం శవమవుతుంది,ధిక్కారం వినలేని అధికారమే దేశభక్తిని అవమానిస్తుంది దేశం అంటే ప్రభుత్వం కాదు, జెండా కాదు, కుర్చీ కాదు,దేశం అంటే ప్రజలు వారి గొంతు, వారి హక్కు, వారి స్వేచ్ఛ ఆ స్వేచ్ఛ కోసం నిలబడి ప్రశ్నించే ప్రతి మనిషినిజమైన దేశభక్తుడుమీ ముద్రలకు తలవంచని పౌరుడు!

# గగుపల్లి గ్రామపంచాయతికి స్వర్గ రథం విరాళం

## రెండు లక్షల విలువైన విరాళంగా అందజేసిన

## లాలన వృద్ధాశ్రమం చైర్ పర్సన్ గడ్డం సునీత...

**ఆలూర్ జూన్ 7 హైదరాబాద్ మిర్రర్**

ఆలూర్ మండలం గగుపల్లి గ్రామ సర్పంచ్ కొండి నడిపి గంగాధర్ విజ్ఞప్తి మేరకు స్వర్గ రథాన్ని అంకాపూర్ లాలన వృద్ధాశ్రమం వాస్తవ్యులు గడ్డం సునీత తమ తల్లిదండ్రులు గడ్డం సుశీల రాజారెడ్డి జ్ఞాపకార్థం రూ.2.34 లక్షల విలువైన స్వర్గ రథాన్ని విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో గ్రామపంచాయతీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. గ్రామంలో మరణించిన వారి అంతిమయాత్రలను గౌరవప్రదంగా నిర్వహించేందుకు స్వర్గ రథం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సామాజిక సేవా దృక్పథంతో విలువైన స్వర్గ రథాన్ని అందజేసిన గడ్డం సునీత కు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.తరువాత గడ్డం సునీత మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడం తమ కుటుంబానికి ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో ఈ స్వర్గ రథం ఉపయోగపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ కొండి గంగాధర్ ఉపసర్పంచ్ గంగామణి,మాజీ సర్పంచ్ రాస జగదీష్ వార్డు మెంబర్స్ విడిసి మెంబర్స్ మరియు కృష్ణ రెడ్డి, సునంద యువకులు గ్రామస్థులు పాల్గొన్నారు





# ఫోన్ ట్యాపింగ్ వివాదం: "నా ఫోన్ మాత్రమే కాదు.. హరీశ్ ఫోన్ కూడా ట్యాప్ చేశారు" --

## ఎంపీ చామల సంచలన ఆరోపణ

**హైదరాబాద్, జూన్ 7 ( హైదరాబాద్ మిర్రర్ దినపత్రిక ):**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడిందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో తన ఫోన్ మాత్రమే కాకుండా అప్పటి మంత్రి హరీశ్‌రావు ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా శనివారం సిట్ అధికారులు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, 2023లో తన ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు తనకు తెలిపారని చెప్పారు. ఆ సమయంలో తాను టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్‌గా పనిచేస్తూ, అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉండటమే ట్యాపింగ్‌కు కారణమని ఆరోపించారు.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేసిన చామల, "అధికార దుర్వినియోగంలో కేసీఆర్‌ను మించిన వారు లేరు. అధికారం కోసం ఆయన ఎంతకైనా తెగిస్తారు" అని వ్యాఖ్యానించారు. తన ఫోన్‌తో పాటు హరీశ్‌రావు ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని పేర్కొంటూ, "ఈ విషయాన్ని హరీశ్‌రావు కాదనగలరా?" అని ప్రశ్నించారు.ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందనే అనుమానంతోనే హరీశ్‌రావు తన వ్యక్తిగత సిబ్బందిలో మార్పులు చేశారని, పీఏతో పాటు కారు డ్రైవర్‌ను కూడా మార్చుకున్నారని చామల తెలిపారు. ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడి గోప్యతను ఉల్లంఘించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టం ముందు తప్పకుండా శిక్ష అనుభవించాల్సిందేనని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, సిట్ అధికారులు మరిన్ని కీలక వివరాలను సేకరిస్తున్నారు.

# దొంగతనం పుకార్ నమ్మవద్దు

**ఆర్మూర్, హైదరాబాద్ మిర్రర్, జూన్ 7 :-**



మాజీ రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కే.ఆర్. సురేష్ రెడ్డి నివాసంలో దొంగతనం జరిగినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలు పూర్తిగా అవాస్తవం. ఇలాంటి తప్పుడు వార్తలు, నిరాధార ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కె ఆర్ సురేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కే.ఆర్. సురేష్ రెడ్డి నివాసంలో ఎలాంటి దొంగతనం జరగలేదు. సోషల్ మీడియా వేదికగా అసత్య సమాచారాన్ని ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమైన చర్య.ప్రజలు మరియు సోషల్ మీడియా వినియోగదారులు వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే సమాచారాన్ని పంచుకోవాలని ఈ సందర్భంగా సురేష్ రెడ్డి కోరారు.

# గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ మిర్రర్ న్యూస్ జూన్ 7:**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలంలోని బాబానగర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ శివారిలో గల గ్రామదేవత పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ ప్రజలు సంప్రదాయబద్ధంగా వలగొడుగులు,డప్పు చప్పుళ్లు,పాదయాత్రలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు.తీపి వంటకాలు,కల్లు సాక తదితర సంప్రదాయ నైవేద్యాలను అమ్మవారికి సమర్పిస్తూ సమృద్ధిగా వర్షాలు కురవాలని,పాడి పంటలు పుష్కలంగా పండాలని,గ్రామ ప్రజలు సుఖశాంతులతో పాటు పిల్లాపాపలు ఆరోగ్యంగా ఉండాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోచమ్మ తల్లి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తోట రమేష్,ధర్పల్లి రాజేశ్వర్,మాణిక్యాల శ్రీనివాస్,కట్ట రవి,సిద్ధ పెల్లి లక్ష్మణ్,సిద్ధ పెల్లి సాగర్,భీమ రవీందర్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889